# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 14-04-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- అణగారిన వర్గాల ఆర్థిక, సామాజిక హక్కుల కోసం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తన జీవితాన్ని అంకితం చేశారని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పేర్కొన్నారు.
- కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలు, విధానాలు అంబేద్కర్ ఆలోచనలు, ఆశయాలకు అనుగుణంగా ఉంటాయని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తెలిపారు.
- న్యాయ వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి ఫోరెన్సిక్ సైన్స్ ఉపయుక్తంగా నిలుస్తోందని కేంద్ర హోమంత్రి అమిత్ షా చెప్పారు.
- ప్రధానమంత్రి నరేంద్రమోదీ “మన్ కీ బాత్ మనసులోని మాట” కార్యక్రమం 121వ సంచిక ఈనెల 27న ప్రసారమవుతుంది.

=======================

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా దేశ ప్రజలు ఆయనకు ఘన నివాళులు అర్పించారు. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ఉపరాష్ట్రపతి జగదీప్ ధనకర్, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తదితరులు ఈరోజు పార్లమెంట్ హౌస్ కాంప్లెక్స్ లో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి నివాళులు అర్పించారు. సామాజిక సంస్కర్తగా, ఆర్థికవేత్తగా, ఉన్నత విద్యావంతునిగా, న్యాయ నిపుణుడిగా, బహుముఖ ప్రజ్ఞాశీలిగా డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ నిలుస్తారని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తన సందేశంలో పేర్కొన్నారు. అణగారిన వర్గాల ఆర్థిక, సామాజిక హక్కుల కోసం తన జీవితాన్ని అంకితం చేశారని అన్నారు. విభిన్న రంగాలలో అంబేద్కర్ చేసిన కృషి భవిష్యత్ తరాల నిర్మాణం కోసం నిబద్ధతతో పని చేయడానికి అవసరమైన ప్రేరణను అందిస్తుందని రాష్ట్రపతి అన్నారు. లోక్ సభ స్పీకర్ ఓం బిర్లా, ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖ గుప్తా పలువురు కేంద్ర మంత్రులు, పార్లమెంట్ సభ్యులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు సంవిధాన్ సెంట్రల్ హాల్లోని డాక్టర్ అంబేద్కర్ చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు.

=======================

అణగారిన వర్గాల జీవితాల్లో అభివృద్ధిని తీసుకురావడానికి, వారి ఆకాంక్షలను సాకారం చేయడం లక్ష్యంగా పని చేస్తున్నామని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పేర్కొన్నారు. ఈరోజు హర్యానాలోని హిసార్ లో జరిగిన బహిరంగ సభలో ప్రధానమంత్రి పాల్గొని ప్రసంగించారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా నివాళులు అర్పించిన అనంతరం ప్రధానమంత్రి మాట్లాడుతూ.. అంబేద్కర్ జయంతి దళితులు, అణగారిన, వెనుకబడిన వర్గాలకు దీపావళి వంటిదని అన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలు రూపొందించే విధానాలు అంబేద్కర్ ఆలోచనలు, ఆశయాలకు అనుగుణంగా ఉంటాయని చెప్పారు. వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాకారం చేయడానికి హర్యానా రాష్ట్రం చిత్తశుద్ధితో పని చేస్తోందన్నారు. వక్ఫ్ చట్టం ఇటీవల చేసిన మార్పులను ఆయన సమర్థిస్తూ... ఇవి పేద ముస్లింలకు ప్రయోజనాన్ని చేకూరుస్తాయని తెలిపారు.

(వాయిస్ 39 సెకన్లు)

అంతకుముందు ప్రధానమంత్రి హిసార్ నుండి అయోధ్యకు వాణిజ్య విమాన సర్వీసును ప్రారంభించారు. అదేవిధంగా 410 కోట్ల రూపాయలతో నిర్మించే నూతన టెర్మినల్ 2 ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడుతూ... 2014 సంవత్సరానికి ముందు భారతదేశంలో 74 విమానాశ్రయాలు ఉండేవని, నేడు వీటి సంఖ్య 150 చేరిందని అన్నారు. హర్యానా ముఖ్యమంత్రి నయాబ్ సింగ్ సైని మాట్లాడుతూ... విమాన సర్వీసుల ప్రారంభం వలన ప్రాంతీయ వాణిజ్యం, పర్యాటకం, పెట్టుబడి అవకాశాలు మరింత పెరుగుతాయని చెప్పారు. అదేవిధంగా 1000 కోట్ల రూపాయలతో చేపట్టే పలు అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రారంభం, శంకుస్థాపనలు చేశారు.

======================

ఇండియన్ కోస్ట్ గార్డ్, గుజరాత్ యాంటీ-టెర్రరిజం స్క్వాడ్‌తో సమన్వయంతో పని చేస్తూ 1,800 కోట్ల రూపాయల విలువైన 300 కిలోల మెథా ఫెటమైన్‌ను స్వాధీనం చేసుకుంది. కచ్చితమైన సమాచారంతో కోస్ట్ గార్డ్ జరిపిన దాడుల్లో అంతర్జాతీయ సముద్ర సరిహద్దు రేఖ సమీపంలో ఒక నౌకను నిలువరించింది. అనుమానితులు మాదకద్రవ్యాలను సముద్రంలోకి విసిరేసి అంతర్జాతీయ జలాల్లోకి పారిపోయారు. మాదకద్రవ్యాలను తరలిస్తున్న పడవ తప్పించుకోగా, ఐసిజి బృందాలు వీటిని స్వాధీనం చేసుకున్నాయి. దర్యాప్తు కోసం ఈ మాదక ద్రవ్యాలను పోర్ బందర్‌కు తీసుకువచ్చారు.

======================

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆదర్శాలు, జీవితం గురించి తెలుసుకోవడానికి యువతరం తప్పనిసరిగా పంచతీర్థం సందర్శించాలని కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రి వీరేంద్ర కుమార్ సూచించారు. ఈరోజు న్యూఢిల్లీలో అంబేద్కర్ జయంతి సందర్భంగా జాతీయ షెడ్యూల్డ్ కులాల కమిషన్ నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ... అంబేద్కర్ జీవితంతో ముడిపడి ఉన్న పంచతీర్థం యువ తరానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. పంచతీర్థం ఆయన జీవితానికి సంబంధించిన 5 ముఖ్యమైన ప్రదేశాలను సూచిస్తుందన్నారు. కేంద్ర న్యాయ శాఖ సహాయ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ మాట్లాడుతూ... డాక్టర్ అంబేద్కర్ రాజ్యాంగంలో సమానత్వం, స్వేచ్ఛ, సోదరభావం అనే మూడు స్తంభాలను దేశానికి అందించారని అన్నారు.

విరామం

======================

నూతనంగా తీసుకువచ్చిన 3 నూతన నేర చట్టాలు 21వ శతాబ్దంలో అతిపెద్ద సంస్కరణలుగా నిలుస్తాయని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు. న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన ఆల్ ఇండియా ఫోరెన్సిక్ సైన్స్ సమ్మిట్‌లో అమిత్ షా మాట్లాడుతూ... సకాలంలో ప్రజలకు న్యాయం అందించడం, న్యాయం పొందడంలో సంతృప్తిని కలిగించడం లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. న్యాయ వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి ఫోరెన్సిక్ సైన్స్ ఎంతో ఉపయుక్తంగా నిలుస్తోందన్నారు. సమర్థవంతమైన, సురక్షితమైన భారతదేశాన్ని తీర్చిదిద్దడం

జరుగుతోందని చెప్పారు. ఫోరెన్సిక్ సైన్స్ సహాయంతో దోషులను గుర్తించడం వేగవంతం అవుతుందని పేర్కొంటూ...

(వాయిస్ 40 సెకన్లు)

ఈ కార్యక్రమంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాజేష్ బిందాల్, జాతీయ మానవ హక్కుల కమిషన్ ఛైర్మన్, విశ్రాంత న్యాయమూర్తి వి. రామ సుబ్రహ్మమణ్యన్, భారత అటార్నీ జనరల్ ఆర్. వెంకటరమణి తదితరులు ఈ సమావేశంలో ప్రసంగించారు.

=======================

మాదకద్రవ్యాల నెట్ వర్క్ లను నిర్వీర్యం చేయడంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం విశేష కృషి చేస్తోందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు. ఈరోజు ఆయన సామాజిక మాధ్యమం వేదికగా పేర్కొంటూ... అంతర్జాతీయ సముద్ర సరిహద్దు సమీపంలో భారత నిఘా సంస్థలు 1,800 కోట్ల రూపాయల విలువైన మాదకద్రవ్యాలను స్వాధీనం చేసుకున్నాయని చెప్పారు. మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రభుత్వం తీసుకున్న విధానాలు సఫలమయ్యాయని చెప్పడానికి ఈ ఆపరేషన్ ఒక ఉదాహరణ అని ఆయన అన్నారు. మాదకద్రవ్యాల రహిత భారతదేశాన్ని నిర్మించడానికి ఈ విజయం ఎంతో స్ఫూర్తినిస్తుందని చెప్పారు. ఈ సందర్భంగా గుజరాత్ పోలీస్ శాఖను, భారత కోస్ట్ గార్డులను అమిత్ షా అభినందించారు.

=======================

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్ మనసులోని మాట” కార్యక్రమం 121వ సంచిక ఈనెల 27వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈనెల 25వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు.

=======================

నాగాలాండ్ రాష్ట్రంలో సోలార్ మిషన్ ను రాష్ట్ర ముఖ్యమంత్రి నీఫియూ రియో ఈరోజు ప్రారంభించారు. ఈ పథకంలో భాగంగా రాష్ట్రంలో నివాస గృహాలపై సౌరఫలకాలను ఏర్పాటు చేయనున్నారు. “ప్రధానమంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలి యోజన”తో ఇది అనుసంధానమై పని చేస్తుంది. ప్రతి ఇంటికి స్వచ్ఛమైన విద్యుత్ శక్తిని అందుబాటులోకి తీసుకురావడం లక్ష్యంగా పని చేస్తారు.

=======================
=======================